

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్ రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సరఫరాలో గురువారం అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... 33/11 కేవీ ఆదర్శనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న 33 కేవీ విద్యుత్ టవర్ పనుల దృష్ట్యా ఉదయం 8:30 గంటల నుంచి 11:30 గంటల వరకు ఆదర్శనగర్, రాంనగర్, గాయత్రీపురం, ఆస్రా కాలనీ, ఈద్గాం, గోల్డెన్ ఫంక్షన్ హాల్, భాగ్యనగర్ ఫిష్ మార్కెట్, సిద్దాపూర్ ఏరియాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

రేషన్‌కార్డుల కోసం.. నిరీక్షణ!



- కార్డుల జారీ మరింత జాప్యం
- సర్వే పేరిట మరోసారి ప్రభుత్వం కాలయాపన
- దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక యాప్
- ఈసారి రెవెన్యూ శాఖ ద్వారా రీ వెరిఫికేషన్
- ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న సిబ్బంది
- పెండింగ్‌లో 40 వేలకు పైగా దరఖాస్తులు
- రేషన్ కార్డుల కోసం పేదలకు తప్పని ఎదురు చూపులు

నిర్మల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా అర్హులైన పేదలందరికీ అందజేస్తామన్న రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నత్తనడకన కొనసాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నా నేటికి ఎక్కడా కూడా కొత్త రేషన్‌కార్డు ఇవ్వలేదు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలందరికీ రేషన్ కార్డులు అందజేస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీ కేవలం కాగితాలకే పరిమితమైంది. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయలేక అబాసు పాలవుతోంది. ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం అతి తక్కువ సమయంలోనే అన్ని వర్గాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంటోంది. వేలాది మంది నిరుపేదలు కళ్లల్లో వత్తులేసుకొని ఎదురు చూస్తున్న రేషన్‌కార్డుల పంపిణీ సైతం ప్రహసనంగా మారింది. జిల్లా వ్యాప్తంగా కొత్త రేషన్‌కార్డుల కోసం 10,192 మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే ఇప్పటికే ఉన్న రేషన్‌కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేసుకునేందు కోసం మరో 30,973 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 41,165 మంది అర్హులైన వారు ప్రభుత్వం అందజేసే రేషన్ కార్డుల కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. అయితే తాజాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు రీ సర్వే పేరుతో మళ్లీ అధికారులు దరఖాస్తుదారుల ఇళ్ల చుట్టూ తిరుగుతుండటంతో ఇప్పట్లో అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు అందే పరిస్థితి కనిపించడం లేదు. అర్హులను గుర్తించేందుకు రీ సర్వే పేరిట కాలయాపన చేస్తూ పేద ప్రజలను ప్రభుత్వం మరోసారి మోసం చేస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సర్వేలో భాగంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి, తన సిబ్బందితో కలిసి దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి విచారణ చేస్తున్నారు. ఆదాయ ధ్రువీకరణ పత్రంతో పాటు ఎల్పీజీ కనెక్షన్ తదితర వివరాలను సేకరించి ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా ఆర్‌ఐ లాగిన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ వివరాలను ఆయా మండలాల పరిధిలో తహసీల్దార్లు పరిశీలించి డీఎస్‌వో (జిల్లా పౌర సరఫరాల అధికారి) లాగిన్‌కు ఫార్వర్డ్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత అన్ని వివరాలు సక్రమంగా ఉంటే అప్పుడు డీఎస్‌వో అప్రూవల్ ఇస్తారు. ఈ ప్రాసెస్ అంతా పూర్తవ్వాలంటే కనీసం ఆరు నెలల సమయం పడుతుందని చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి అర్హులైన వారి వివరాలు సేకరించిన తర్వాతనే ప్రభుత్వం కొత్త కార్డులను జారీ చేసే అవకాశం ఉంది. అప్పటి వరకు ఎదురుచూపులు తప్పేలా లేవు.



అన్నింటికీ రేషన్ కార్డే ఆధారం

నిర్మల్ జిల్లాలో ప్రస్తుతం 2,08,606 రేషన్ కార్డులు ఉండగా, ఇందులో అంత్యోదయ కార్డులు 12,827, సాధారణ రేషన్‌కార్డులు 1,95,747, అన్నపూర్ణ కార్డులు 32 ఉన్నాయి. ఆయా కార్డుల ద్వారా జిల్లా వ్యాప్తంగా మొత్తం 6,30,242 మంది లబ్ధిదారులకు రేషన్ సరుకులు అందుతున్నాయి. వీరి కోసం ప్రతీ నెల 412 రేషన్ దుకాణాల ద్వారా 39,957 క్వింటాళ్ల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. అయితే ఇటీవల రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుండటంతో అర్హులైన చాలా మంది రేషన్‌కార్డు లేకపోవడం వల్ల తాము నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదలమై ఉండి కూడా బహిరంగ మార్కెట్‌లో 30 నుంచి 40 రూపాయలకు కిలో బియ్యాన్ని కొనుక్కుంటున్నామని వాపోతున్నారు. కాగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కొన్ని పథకాలకు మాత్రమే రేషన్‌కార్డులను ప్రామాణికంగా తీసుకునే వారు. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ పథకం అమలుకు రేషన్ కార్డునే ప్రామాణికం చేయడంతో అర్హులైన వేలాది మంది పేదలు రేషన్ కార్డుల కోసం ఎదరు చూస్తున్నారు. రేషన్‌కార్డుల కోసం ప్రభుత్వం ఇప్పటికే రెండు సార్లు దరఖాస్తులను స్వీకరించింది. మొదట ఆరు గ్యారంటీల అమలు కోసం స్వీకరించిన దరఖాస్తుల సమయంలోనే తెల్ల కాగితాలపై రేషన్ కార్డు లేని వారి నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. మరోసారి కుల గణన సమయంలో రేషన్‌కార్డు లేని వారి వివరాలను నమోదు చేసుకున్నారు. దీంతో పాటు మరికొందరు మీసేవ ద్వారా సైతం రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇలా వచ్చిన అన్ని దరఖాస్తులను ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి అర్హులైన వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మళ్లీ తాజాగా రీసర్వే చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించడంతో ఇప్పటికే జాబితాలో పేర్లున్న వారు ఆందోళన చెందుతున్నారు. పాత జాబితా ప్రకారం ఉన్న కుటుంబాలపై మరింత లోతుగా సూక్ష్మ శోధన చేసి లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకే ప్రభుత్వం రీ సర్వే అంటూ డ్రామాలు ఆడుతున్నదని పేదలు మండిపడుతున్నారు. ఇప్పటికే పలుమార్లు దరఖాస్తుల స్వీకరణ, సర్వేల పేరిట ప్రభుత్వం పేద ప్రజలను మభ్యపెట్టడమే తప్ప రేషన్‌కార్డులు మాత్రం జారీ చేసే అవకాశం కనిపించడం లేదు. ఇదిలా ఉంటే ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం, మహాలక్ష్మి పథకం కింద రూ. 500లకే సిలిండర్ తదితర పథకాలన్నింటికీ రేషన్‌కార్డే ఆధారం కావడంతో ఆయా పథకాలకు దరఖాస్తు చేసుకోలేక నష్టపోతున్నామని అర్హులైన పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డు లేకుండా కనీసం ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని సైతం పొందలేని పరిస్థితి నెలకొన్నదని వాపోతున్నారు. ఇప్పటికైనా సర్వేల పేరుతో కాలయాపన చేయకుండా, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేసి అర్హులైన పేదలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.


కుభీర్‌లో వివరాలు సేకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది (ఫైల్)

అటవీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు

త్వరితగతిన చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : అటవీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను చేపట్టేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఆర్‌ఎఫ్‌వో (రైట్‌ఫుట్ ఫారెస్ట్ రూల్స్) అమలుపై బుధవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో అటవీ, విద్యుత్, ఆర్ అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అటవీప్రాంతాల్లో అభివృద్ధిపనులు చేపట్టేందుకు సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. మారుమూల అటవీ, గిరిజన ప్రాంతాల్లో రహదారులు, బ్రిడ్జిలు, విద్యుత్ తదితర అభివృద్ధి పనులు చేపట్టేందుకు సంబంధిత అధికారులు అటవీశాఖకు సరైన విధంగా ప్రపోజల్స్ సిద్ధం చేసి పంపించాలని సూచించారు. అభివృద్ధి పనులు చేపట్టాల్సిన ప్రతిశాఖ తమ ప్రపోజల్స్‌ను అటవీశాఖతో సమన్వయం చేసుకుని ముందుగా ఆమోదం పొందాలన్నారు. చేపట్టనున్న అభివృద్ధి ప్రాజెక్టులను త్వరితగతిన అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అవసరమైన మార్గ దర్శకాలను సంబంధిత శాఖలకు త్వరితగతిన పంపించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సర్కారు భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

జిల్లాలో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠినచర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సర్కారు భూములు ఆక్రమణకు గురవుతున్న విషయాలు గుర్తించామని, వాటిని రెవెన్యూ అధికారులు వెంటనే స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులకు సర్కారు భూములపై ఎటువంటి ఆక్రమణను అయినా కఠినంగా అణచివేయాలని సూచించారని కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటికే పలు మండలాల్లో రెవెన్యూ శాఖ సర్వేలు చేపట్టి, చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని, ఇకపై అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

సౌదీ నుంచి కుమారుడిని రప్పించాలని వినతి

నిర్మల్ రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : సౌదీఅరేబియా దేశంలో ఉన్న తన కుమారుడిని ఇండియాకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం తల్లి సుజాత, భార్య అంకంవాణి ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన అంకం సుధీర్ కుమార్(36) జగిత్యాల జిల్లా ఏజెన్సీ సహాయంతో సౌదీ అరేబియా దేశంలో ఉన్న ఆరంకో కంపెనీలో ఫోర్‌మెన్‌గా పని చేయడానికి 2023 సంవత్స రంలో వెళ్లాడు. 15 నెలలుగా పనిచేశారు. కాగా ఈ సంవత్సరం ఫిబ్రవరి నెల నుంచి సదరు కంపెనీ కార్మికులకు పనికల్పించకుండా, వీసా గడువు ముగిసినా పునరుద్ధరించకుండా, కాలయాపన చేస్తూ కార్మికులను రూమ్‌కే పరిమితం చేశారని ఆరోపించారు. దీంతో ఖర్చులు పెరిగిపోతున్నాయన్నారు. ఇండియాకు వద్దా మని ప్రయత్నించగా పాస్‌పోర్ట్ యజమాని చేతిలో ఉండటంతో రాలేకపో తున్నాడని తెలిపారు. అనంతరం ఎన్‌ఆర్‌ఐ అడ్వైజరీ కమిటీ మెంబర్ స్వదేశ్ పరికిపండ్లను కలిసి వివరాలు అందించగా అక్కడి కార్మికులతో పాటు సుధీర్, ఉత్తరప్రదేశ్, బీహార్‌కు చెందిన వలస కార్మికులు కూడా ఉన్నట్లు తెలిపారు.

భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్
- రేపు కుంటాలకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాక


స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల


అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ డా.జానకీ షర్మిల

కుంటాల, మే, 14 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలం భూ భారతి పైలట్ ప్రాజెక్టులో ఎంపికైనందున ఇది వరకు రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం సాయంత్రం కుంటాల తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 16వ తేదిన కుంటాలలో నిర్వహించే భూ భారతి రెవెన్యూ సదస్సులో పాల్గొనేందుకు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరుకానున్నట్లు ఆమె తెలిపారు. ముందుగా మండల కేంద్రం కుంటాల స్థానిక మున్నూరుకాపు సంఘం ఫంక్షన్ హాల్‌లో మంత్రి పర్యటన గురించి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పర్యటన సజావుగా సాగేందుకు ఏర్పాట్లను అధికారులతో సమీక్షించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఆమె సిబ్బందితో మాట్లాడుతూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో భూ భారతి రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తుల సమస్యలన్నింటినీ సత్వరమే పరిష్కరించాలన్నారు. భూ సమస్యల దరఖాస్తుల పరిష్కారానికి చేపట్టవలసిన చర్యలపై కలెక్టర్ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారానికి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలన్నారు. నూతన భూభారతి చట్టం కుంటాల మండలంలో అమలులోకి వచ్చినందున ఎలాంటి భూ సమస్యలు లేకుండా సమస్యలన్నింటినీ పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో కోమల్ రెడ్డి, తహసీల్దార్‌లు కమల్‌సింగ్, ఎజాజ్ అహ్మద్‌ఖాన్, ప్రవీణ్ కుమార్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

స్థల పరిశీలన..

భైంసా: భూ భారతి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కుంటాల మండల కేంద్రంలో నిర్వహించే రెవెన్యూ సదస్సుకు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరవుతున్న నేపథ్యంలో ఇక్కడి అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేపడుతున్నారు. మంత్రి హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా భైంసాకు చేరుకొని ఇక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా కుంటాల మండల కేంద్రానికి వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం జిల్లా ఎస్పీ డా. జానకీ షర్మిల, భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, అర్‌అండ్‌బీ డిప్యూటీ ఇంజనీర్ సునీల్ కుమార్‌లు భైంసాలో హెలిపాడ్ ఏర్పాటు కోసం స్థల ఎంపిక కోసం గాను పరిశీలనలు చేపట్టారు. స్థానిక నిర్మల్ మార్గంలోని బైపాస్ రోడ్డు సమీపంలో హెలిపాడ్ ఏర్పాటు కోసం పోలీసు, అర్‌అండ్‌బీ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ఇందులో భైంసా టౌన్ సీఐ గోపినాథ్, రూరల్ సీఐ నైలులతో పాటు అర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

● బందోబస్తుపై ఎస్పీ సమీక్ష

భూభారతి కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరవుతున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్ల జిల్లా ఎస్పీ డా.జానకీ షర్మిల సమీక్షించారు. బుధవారం సాయంత్రం హెలిపాడ్ స్థల ఎంపిక కోసం భైంసాకు వచ్చిన ఎస్పీ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో మంత్రి పర్యటన బందోబస్తు ఏర్పాట్లపై మాట్లాడారు. మంత్రి పర్యటనకు భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ నేతృత్వంలో భైంసా టౌన్ , రూరల్ సీఐలు గోపినాథ్, నైలుల ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లను చేపడుతున్నారు.

అకాల వర్షానికి తడిసిన ధాన్యం


తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళ


టార్పాలిన్ కవర్లపై నిలిచిన నీటిని తొలగిస్తున్న రైతులు

ఖానాపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మంగళవారం రాత్రి బుధవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి వరి ధాన్యం తడిసి ముద్దయింది. ఇదివరకే పంట కల్లాల్లో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం ఈ వర్షానికి తడిసిపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేయడంలో జాప్యం చేస్తుండడంతో పూర్తిగా ఆరిన ధాన్యం సైతం తడిసిపోయే పరిస్థితి వచ్చిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు జాప్యం చేయకుండా యుద్ధ ప్రాతిపదికన తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మరోపక్క చివరి దశకు చేరిన వరిపొలాలు సైతం ఈ వర్షానికి తడిసిపోయి హార్వెస్టర్లు నడవలేని పరిస్థితి తలెత్తడంతో చేతికి అందిన పంట నష్టపోయే పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అకాల వర్షం రైతన్నకు అపార నష్టాన్ని కలిగించిందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి


మహిళలకు అవగాహన కల్పిస్తున్న పోలీసు సిబ్బంది



నిర్మల్ మండలం వెంగ్వాపేట్‌లో...

కుంటాల, మే, 14 : (ఆంధ్రజ్యోతి) : మహిళలు సైబర్‌నేరాల పట్ల అప్ర మత్తంగా ఉండాలని కుంటాల మహిళా పోలీసులు అనిత, అనుప్రియలు పేర్కొన్నారు. కుంటాల ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో బుధవారం బస్టాండ్‌లో మహిళలకు సైబర్‌నేరాల పట్ల అవగాహన కల్పించారు. సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచితులు ఫోన్‌చేసి ఆధార్ నెంబరు, అకౌంట్ వివరాలు అడిగితే చెప్పవద్దని పేర్కొన్నారు. గ్రామాలలో, జనసంచారం లేని ప్రదేశాలలో అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మహిళల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నెంబర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిర్మల్ రూరల్ : మండలంలోని వెంగ్వాపేట్ గ్రామంలో గ్రామస్థులకు బుధవారం సైబర్ నేరాలపై ట్రైనింగ్ ఎస్సై అజయ్ అవగాహన కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సాం కేతిక పరిజ్ఞానంతో కొత్త కొత్త మార్గాల్లో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్య క్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్, ప్రవళిక, పరిమళ పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల పరిశీలన


సూచనలిస్తున్న డీఈవో రామారావు

నిర్మల్ కల్చరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం చాణక్య ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతులను డీఈవో రామారావు బుధవారం పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, వంద శాతం హాజరు కావాలని సూచించారు. శిక్షణలో నేర్పించే అంశాలు తరగతి గదిలో ఉపయోగించుకొని మెరుగైన విద్యాబోధన జరుపాలన్నారు. సమన్వయకర్త కోర్స్ ఇన్‌చార్జ్‌లు ప్రవీణ్ కుమార్, ఎస్. విద్యాసాగర్, డీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి

పిప్పర్‌వాడలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని త్వరలో ప్రారంభిస్తాం : బాలూరి

జైనథ్, మే 14(ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని బోరజ్ మండల పరిధిలోని పిప్పర్‌వాడ గ్రామంలో త్వరలో నాఫెడ్ మార్క్‌ఫెడ్ ద్వారా త్వరలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని ఆదిలాబాద్ డీసీసీబీ డైరెక్టర్ జైనథ్ పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బోరజ్ మండలంలోని నాలుగో క్లస్టర్‌లలో భాగంగా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుకు పిప్పర్‌వాడ గ్రామంలో అధికారులు నాయకులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలు కురిసే నేపథ్యంలో మూడు రోజుల్లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. జొన్న రైతు ఆందోళన చెందవల్సిన అవసరం లేదని, మే 30వ తేదీ లోపు జొన్న పంటను పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జైనథ్ పీఏసీఎస్ సీఈఓ జి.గంగన్న, మండల వ్యవసాయ అధికారి అష్రఫ్, సొసైటీ కార్యదర్శి సుశీల్‌కుమార్, మాండగడ మాజీ సర్పంచ్ సైపట్ హిందు, మహేందర్‌రావు, పిప్పర్‌వాడ మాజీ సర్పంచ్ నోముల సంతోష్ రెడ్డి, పూసాయి మాజీ సర్పంచ్ పోతారెడ్డి, నాయకులు ప్రభాకర్‌లతో పాటు ఆయా గ్రామాల జొన్న రైతులు, తదితరులు పాల్గొన్నారు.

'సమ్మెను విజయవంతం చేయండి'

తలమడుగు, మే 14(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈ నెల 20న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న కోరారు. బుధవారం తలమడుగు మండల కేంద్రంలో సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న మాట్లాడుతూ కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండి వైఖరి వహిస్తుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంతేకాకుండా కార్మికుల కోసం ప్రభుత్వం వారి చట్టాలను అమలు పరచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. మొత్తం 44 చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మారుస్తామని కేంద్ర ప్రభుత్వం చెబుతోందని, అటువంటి ఆలోచనను పునరాలోచించాలని ఆయన అన్నారు. కార్మికులకు కనీసం వేతనంతో పాటు ఉద్యోగం భద్రత కల్పించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో మే 20న గ్రామీణ బంద్ చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో కళావతి, రాధ, రమణ పద్మ, కే.సుధాకర్, తదితరలు పాల్గొన్నారు.



తలమడుగులో పోస్టర్లను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

అఖిల భారత హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో
కొండగట్టుకు స్వాముల మహా పాదయాత్ర

తలమడుగు, మే 14(ఆంధ్రజ్యోతి): అఖిల భారత హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కుచులాపూర్ గ్రామం నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లా కొండగట్టుకు హనుమాన్ దీక్షపరులు మహా పాదయాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గురుస్వామి, మేకల సదాశివ్ యాదవ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో గల దుర్గాప్రసాద్ స్వామీజీ దివ్య ఆశీస్సులతో గత 12 సంవత్సరాల నుంచి ప్రతీ సంవత్సరం కుచులాపూర్ గ్రామంలో దాదాపు 200 మంది హనుమాన్ దీక్ష చేపట్టి కుచులాపూర్ నుంచి వాయు పుత్రుడు కొలువుదీరిన కొండగట్టుకు పాదయాత్రగా వెళ్లడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదేవిధంగా కొండగట్టు హనుమాన్ ఆలయంలో భక్తులందరికీ మహా అన్నదాన ప్రసాదం నిర్వహిస్తూ ఉన్నారు. ఇందులో భాగంగా ఈనెల 22న కుచ్లాపూర్ గ్రామానికి చెందిన హనుమాన్ దీక్షపరులు, గ్రామస్థులు, భక్తుల సహకారంతో మహా అన్నదానాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ దీక్ష పరులతో పాటు భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా గ్రామం నుంచి కొండగట్టుకు పాదయాత్రగా వెళ్తున్న హనుమాన్ దీక్ష పరులకు గ్రామస్థులు మంగళహారతులు, భాజా భజంత్రీలతో ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా హనుమాన్ దీక్ష పరులు చేసిన స్వామి వారి నృత్యం ఎంతగానో ఆకట్టుకుంది.



సామూహిక పూజా కార్యక్రమంలో పాల్గొన్న హనుమాన్ దీక్షాపరులు



కుచలాపూర్ నుంచి పాదయాత్రగా తరలివెళ్తున్న స్వాములు

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలి

● కాంగ్రెస్ శ్రేణులకు పార్టీ పరిశీలకుల పిలుపు

జైనథ్, మే 14(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడే వారికి పదవులు వెతుక్కుంటు వస్తాయని, జెండా మోసిన కార్యకర్తలను పార్టీ గుర్తిస్తుందని, పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, పరిశీలకులు, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్, బోరజ్ మండలం నిరాల గ్రామంలోని త్రినేత్ర గార్డెన్‌లో బేల, జైనథ్, బోరజ్ మండలాల కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మరో పరిశీలకుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ ఎంతో చరిత్ర కలిగిన పార్టీ అని తాహెర్‌బిన్ హందాన్ తెలిపారు. ఈ మూడు మండలాలలో పార్టీకి పునర్ వైభవం తీసుకు రావాలనే ఉద్దేశంతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీలో ఉంటూ పార్టీ కోసం కష్టపడే నాయకులు పదవులకు అర్హులన్నారు. అలాంటి వారు అధ్యక్ష పదవులను ఆశించవచ్చన్నారు. నాయకులు, కార్యకర్తలు పదవుల కోసం కాకుండా పనిలో పోటీ పడాలని, పార్టీ కోసం పని చేయాలని, అప్పుడు మంచి కార్యకర్తగా గుర్తింపు వస్తుందన్నారు. అనంతరం చిట్ల సత్యనారాయణ మాట్లాడుతూ పార్టీ ప్రక్షాళన కోసమే ఈ విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పెద్దల ఆదేశానుసారం జిల్లాలో పార్టీని తిరిగి పటిష్ట స్థితికి చేర్చేందుకు ఈ కార్యక్రమానికి వచ్చినట్లు తెలిపారు. ఆ తర్వాత అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పేద, బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటు పడే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. అంతా కలిసి కట్టుగా పార్టీ బలోపేతం కోసం పని చేస్తామన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకు పోతున్నామన్నారు. ఇందులో ఏఐసీసీ సభ్యుడు నరేష్‌జాదవ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్‌రెడ్డి, బేల మండల అధ్యక్షుడు ఫైజల్లాఖాన్, సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు, లోక ప్రవీణ్ రెడ్డి, ఏంఎ షకీల్, మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లె, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వామన్‌వాంఖడే, తదితరులు పాల్గొన్నారు.

3.5 తులాల బంగారం చోరీ

● లోన్ ఇప్పిస్తానని మాయ మాటలతో నమ్మించి పరారీ

మావల, మే 14 (ఆంధ్రజ్యోతి): లోన్ ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి 3.5 తులాల బంగారం ఎత్తుకెళ్లి ఓ అపరిచిత వ్యక్తి పరార్ అయినా సంఘటన చోటు చేసుకుంది. మావల ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని దోబీ కాలనికి చెందిన సరస్వతి అనే వృద్దురాలు తన ఇంటి వద్ద బ్రష్ చేసుకుంటూ ఉండింది. ఆమె ఇంటి వైపు వచ్చిన అపరిచితుడు బంగారం ఉంటే ఎక్కువ మొత్తంలో లోన్ వస్తుంది, బంగారం సంబంధించిన పత్రాలు కావాలని నమ్మించి బలికాడు. నమ్మకం రాకుంటే తన వెంట బ్యాంక్‌కి మీ ఇంట్లో వారిని పంపాలని అన్నాడు. అయితే నమ్మిన సరస్వతి తన అల్లుడిని అపరిచితుడి వెంట పంపింది. ఆ తర్వాత రాంనగర్‌లోని ఓ బ్యాంక్ వద్ద బైక్‌ని ఆపి ఆఫీస్ పైన ఉంది నేను వెళ్లి వస్తాను చెప్పి వెళ్లాడు. ఆధార్ కార్డు అవసరం ఉందని నేను మీ అత్తగారి దగ్గరకి వెళ్లి వస్తా, మీరు ఇక్కడే ఉండమని చెప్పి పరార్ అయ్యాడు. విషయం తెలుసుకుని, మోసపోయాం అని గమనించిన బాధితులు మావల పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. ఎవరైనా అపరిచితులు వస్తే నమ్మవద్దని, పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపారు.

'యువ వికాసం' కొందరికేనా?

(5వ పేజీ తరువాయి...)

అవకాశం లేక పోలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇక సిబిల్‌తో పని లేదు..

దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్ ఆధారంగానే పథకాన్ని మంజూరు చేస్తారన్న ప్రచారంతో కొంత గందరగోళ పరిస్థితికి దారి తీసింది. దీంతో ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత, ఒత్తిడి రావడంతో ప్రభుత్వం వెనుకడుగు వేసింది. తాజాగా రాజీవ్ యువవికాసం పథకానికి సిబిల్ స్కోర్‌తో పని లేదంటూ రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. నిబంధనల ప్రకారం అర్హులైన వారికే పథకాన్ని మంజూరు చేసేలా చర్యలు చేపడుతామని ప్రకటించింది. అయితే మొదట రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు దరఖాస్తు చేసుకున్న యునిట్లకే ప్రాధాన్యతనిచ్చే అవకాశం కనిపిస్తుంది. ఆ తర్వాత లక్షకు పైగా ఉన్న రుణాలను మంజూరు చేసే వీలుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా మహిళలకు 25 శాతం రిజర్వేషన్ కల్పించనున్నారు. ఇందులో ఒంటరి మహిళలు, వితంతువులు, వికలాంగులకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇవ్వనున్నారు. దరఖాస్తుదారుల ఆర్థిక పరిస్థితి, వ్యాపారంలో ఉన్న అనుభవం తదితర అంశాలను కూడా పరిగణలోకి తీసుకుంటారు.

పనిచేయని బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్.. వినియోగదారులకు తప్పని ఇక్కట్లు!!

బోథ్, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు సిగ్నల్స్ వ్యవస్థ పని చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రైవేట్ టెలికం సంస్థలు పోటీపడి రోజురోజుకు తమ సిగ్నల్స్ వ్యవస్థను మెరుగుపరచుకుంటూ టవర్ల నిర్మాణం కొనసాగిస్తూ పోతుంటే ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ అధికారులు మాత్రం సిగ్నల్ వ్యవస్థను మెరుగు పరచడంలో నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. గత 14 రోజులుగా బీఎస్ఎన్ఎల్ సెల్ ఫోన్ వినియోగదారులకు ఈ ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. ఇకనైనా బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ వ్యవస్థను వినియోగదారులకు అందేవిధంగా చూడాలని, లేకుంటే వినియోగదారులు ప్రైవేట్ రంగంలోని టెలికం సేవలకు తరలిపోయే ఆస్కారం ఉందంటున్నారు.

కుమారిలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

నేరడిగొండ, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమారి గ్రామంలో గల రైతు వేదికలో బుధవారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది, ఈ సందర్భంగా పలువురు శాస్త్రవేత్తలు ఏఆర్ఎస్ అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామప్రసాద్, శాస్త్రవేత్త డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఎంఏఓ కృష్ణవేణి మాట్లాడుతూ పలు పంటలకు సంబం ధించిన విషయాలను తెలపడం జరిగింది. అంతేకాకుండా ఫర్టిలైజర్ మందులు ఇష్టానుసారంగా వాడకుండా ఆలోచించి ఫర్టిలైజర్ మందులను ఉపయోగించుకోవాలని తెలిపారు. అంతేకాకుండా రైతులు వ్యవసాయ పనులపై ఆమె ఈ సందర్భంగా పలు సూచనలు ఇచ్చారు. ఎంఏవో కృష్ణవేణి రైతులకు వానా కాలం పత్తి విత్తనాలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. గంజా సాగు వల్ల రైతులు రైతుభరోసా, రుణ మాఫీ అనర్హులు అని తేలిపారు. రైతులు అడిగిన ప్రశ్నలకు శాస్త్రవేత్త సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమం లో పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేష్ రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఏవో కృష్ణవేణి

విద్యార్థులకు అరటి పండ్ల పంపిణీ



విద్యార్థులకు పండ్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

నిర్మల్ అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో బుధవారం ఉదయం నిర్వహించిన సమ్మర్ క్యాంపులో పాల్గొంటున్న విద్యార్థులకు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో అరటి పండ్లను పంపిణీ చేశారు. పిల్లల ఆరోగ్యరీత్యా పండ్ల పంపిణీ కొనసాగుతుందని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం కేసులో 10 ఏళ్ల జైలు

నిర్మల్ రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : బాలిక కిడ్నాప్, అత్యాచార కేసులో ఒకరికి పదిసంవత్సరాల కఠినకారాగార శిక్ష, రూ.3000ల జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ జానకిషర్మిల బుధవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం... ఆదిలాబాద్‌కి చెందిన నేరస్తుడు షైక్‌సమీర్ ఓ బాలికకు మాయమాటలు చెప్పి కిడ్నాప్‌చేసి హైదరాబాద్, జైనూర్ పరిసరాలకు తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై సంజీవ్ కేసు నమోదు చేశారు. డీఎస్పీ ఉపేందర్ రెడ్డి కేసు విచారించి నేరస్తుడిని రిమాండ్‌కు తరలించారు. అనంతరం చార్జ్‌షీట్ వేయగా మెజిస్ట్రేట్ షైక్‌సమీర్‌కు పదిసంవత్సరాల జైలు శిక్ష, రూ.3000 జరిమానా విధించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటంలో కృషిచేసిన అప్పటి ఇన్వెస్టిగేషన్ అధికారి డీఎస్పీ ఉపేందర్ రెడ్డి (ప్రస్తుత అదనపు ఎస్పీ అడ్మిన్‌గా నిర్మల్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు)ని ఎస్సై సంజీవ్, కోర్టులైజనింగ్ ఆఫీసర్, ఎస్సై డల్లుసింగ్, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్ ఎస్.ప్రభాకర్, హెడ్‌కానిస్టేబుళ్లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

వివాహితపై అత్యాచారం కేసులో...

నిర్మల్ రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : వివాహితురాలిపై అత్యాచారం, చంపుతానని బెదిరించిన కేసులో పదిసంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 1500లు జరిమానా విధించినట్లు లైజన్ అధికారి డల్లు సింగ్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. 2022 సంవత్సరంలో కరెంట్ ఆఫీస్ దగ్గర నిర్మానుష్యప్రదేశంలో ప్లాస్టిక్ వస్తువులు ఏరుకుంటుండగా నిందితుడు అడెల్లు బాధితురాలిని వెంబడిస్తూ అత్యాచారం జరిపి పారిపోయాడని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ శ్రీనివాస్ కేసునమోదు చేసుకుని విచారణ జరిపి తుది నివేదికను కోర్టుకు సమర్పించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోద్‌రావు సాక్షులను విచారించారు. ఈ ఘటనపై జిల్లా సెషన్ న్యాయాధికారి శ్రీవాణి నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగా శిక్ష, రూ.1500లు జరిమానా విధించినట్లు తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు

నర్సాపూర్(జీ), మే 14 (ఆంధ్రజ్యోతి) : గత నెల 23వ తేదీ నుంచి నర్సాపూర్(జీ) గ్రామానికి చెందిన బర్కుంట వాణి(33) అనే మహిళ కనిపించడం లేదని కుటుంబసభ్యులు తెలిపారు. ఇన్ని రోజులు ఆమె కోసం పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం వాణి తండ్రి బర్కుంట పెద్దముత్యం పోలీసులను ఆశ్రయించాడు. నర్సాపూర్(జీ) పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై సాయికిరణ్ కేసునమోదు చేసి విచారణ చేపట్టారు.

నేరాల నియంత్రణకు చర్యలు

సోన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాంధీనగర్ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. సోన్‌సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోన్‌పోలీస్‌స్టేషన్ ఎస్సై గోపి, సిబ్బందితో తగిన ధ్రువ పత్రాలు లేని 102 ద్విచక్రవాహనాలను, మూడుచక్రవాహనాలను సీజ్‌చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మీనా ఐపీఎస్ మాట్లాడుతూ... జిల్లా ఎస్పీ ఆదేశాలతో నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణ, భద్రత పోలీసుల బాధ్యత అని, కాలనీలో కొత్తవ్యక్తులు, నేరస్తులు షెల్టర్ తీసుకుని ఉంటే పోలీసులకు సమాచారం అదించాలని కోరారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని, యువత చెడు అలవాట్లకు గంజాయి, మద్యం, డ్రగ్స్‌లకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని లేదా సమస్యలుంటే 100 నెంబర్‌కి కాల్ చేయాలని సూచించారు. సైబర్ నేరాలు, మోసగాళ్ల ఫోన్‌కాల్స్, మెసేజ్, వాట్సాప్ కాల్స్‌లకు స్పందించవద్దని సూచించారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, చట్టవ్యతి రేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ అందరూ కలిగి ఉండాలన్నారు. కాలనీలో మరింత స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలను అమర్చుకోవాలని ఈ విషయంలో పోలీసుల సహకారం ఉంటుందని, భద్రత పరమైన అంశాలలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. నిర్మల్ పోలీసు... మీ పోలీసులో... భాగంగా మీ గ్రామంలో ఎవరైనా నిషేధిత గంజాయిని విక్రయించిన, రవాణా చేసిన తమకు (8712659599) సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై గోపి, అశోక్, ప్రొబేష నరీ ఎస్సై సుప్రియ, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న రాజేష్ మీనా

జొన్న లేప తిని గొర్రెల మృతి



మృతిచెందిన గొర్రెలు

ముథోల్, మే 14 (ఆంధ్రజ్యోతి) :గొర్రెలు జొన్న లేప తిని నాలుగైదు రోజుల నుంచి 13 గొర్రెలు మృతిచెందినట్లు బాధితుడు తెలిపారు. నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామానికి చెందిన గొల్లమురళి యాదవ్‌కు సంబంధించిన గొర్రెలు మృతిచెందాయి. ఇటీవల కురిసిన వాన చినుకులకు గ్రామ శివారులో జొన్న కోసిన చేన్లలో జొన్న లేప చిగురించింది. అయితే సంబంధిత బాధితుడు తమ గొర్రెలను మేపేందుకు వెళ్లినప్పుడు గొర్రెలు జొన్న లేపను తిన్నాయి. దీంతో అస్వస్థతకు గురైన గొర్రెలకు చికిత్స నిర్వహించిన ఫలితం లేదు. దీంతో సోమవారం వరకు 8 గొర్రెలు మృత్యువాత పడగా మంగళవారం 3 గొర్రెలు, బుధవారం 2 గొర్రెలు మొత్తం 13 గొర్రెలు చనిపోయాయని దీంతో సుమారు రూ. లక్ష ఇరవై వేల వరకు ఆర్థికంగా నష్టపోయినట్లు తెలిపాడు. ప్రభుత్వం తమకు ఆదుకోవాలని కోరారు. రైతులు తమ జొన్న పంట కోసిన తరువాత లోతు దుక్కులు దున్ని నట్లయితే లేప చిగురించదని పశువైద్యాధికారి డా.రవీందర్ తెలిపారు. దీంతో జొన్న లేప పెరగకపోవడంతో పశువులకు ఇబ్బంది ఉండదన్నారు.

పార్టీ కోసం శ్రమించిన వారికే పదవుల్లో ప్రాధాన్యత

● ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్

● ఖానాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఖానాపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ కోసం శ్రమించిన వారికి పార్టీ పదవుల్లో ప్రాధాన్యత దక్కుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జేకే ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పరిశీలకులు చంద్రశేఖర్ గౌడ్, ఎండీ అవేజ్, ఆదిలాబాద్ జిల్లా పరిశీలకులు తహర్బిన్ హందన్, డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి వేణు గోపాల చారి, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్ చార్జి అజ్మీరా శ్యామ్ నాయక్, తదితరులు హాజరై ప్రసంగించారు పార్టీ పదవులు దక్కని వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో న్యాయం చేస్తామని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో పార్టీ కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఖానా పూర్ మండల అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు పదవి కోసం నామినేషన్ పత్రాలను అందజేశారు. ఆయా పదవులకు వచ్చిన నామినేషన్ల ఆధారంగా పార్టీకోసం వారు చేసిన కృషిని పరిగణలోకి తీసుకొని పార్టీ అధిష్టానం పదవులను కేటయిస్తుందని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఆయా గ్రామాల అధ్య క్షులు, నియోజకవర్గ స్థాయి అనుబంధ సంఘా ల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, మాజీ జడ్పీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు భారీగా హాజరయ్యారు.

సైకిల్‌పై హజ్‌యాత్రకు వెళ్తున్న వ్యక్తికి సన్మానం



యువకుడిని సన్మానిస్తున్న ముస్లిం ఏక్తా సొసైటీ సభ్యులు

నిర్మల్ రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : సైకిల్‌మీద హజ్ యాత్రకు వెళ్తున్న హఫీజ్ తాలిబ్ నిర్మల్ చేరుకున్నందుకు పట్టణ యువకులు కలిసి ముస్లిం ఏక్తాసంఘం ఆధ్వర్యంలో పూలతో ఘనసన్మానం చేశారు. సొసైటీ అధ్యక్షులు షేక్ ముజాహిద్ మాట్లాడుతూ... ఇండియాలో హిందూ సోదరులకు, ముస్లిం సోదరులకు, క్రైస్తవ సోదరులకు అందరి గురించి ప్రార్థన చేయాలని, అల్లాతో వారి ఆరోగ్య ఐశ్వర్యాలతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం సంఘం అధ్యక్షులు షేక్ ముజాహిద్, ఉపాధ్యక్షులు సాజిద్, ప్రధాన కార్యదర్శి అల్మాస్, సోషల్‌మీడియా ఇన్‌చార్జ్ ఫాజిల్ హస్మి, అస్లాం, ఇలియాస్, యువకులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి

తానూర్, మే 14 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని పశువైద్యాధికారి అమృతం అన్నారు. మండలంలోని ఝరి(బి) గ్రామంలో బుధవారం పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో పశువులకు ఎలాంటి వ్యాధులు సోకకుండా గాలికుంటు టీకాలు ఎంతగానో పని చేస్తాయని అన్నారు. రైతులకు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలను వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గోపాల మిత్ర మొగొలాజీ , రైతులున్నారు.

కిరాణా షాప్‌లో చోరీ

నర్సాపూర్(జి), మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చాక్‌పల్లి గ్రామంలో మంగళవారం గ్రామానికి చెందిన సలీం కిరాణా షాప్‌లో చోరీ జరిగింది. యజమాని, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం రాత్రి ఉదయం 6 గంటలకు షాప్‌ను తెరిచేందుకు రాగా కిరాణా షాప్ షెటర్ రెండు తాళాలు పగులగొట్టి కౌంటర్ నుండి 3 వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లారని తెలిపారు. చాక్‌పల్లి మెయిన్ రోడ్డుకు ఆనుకొని ఉండడంతో దొంగ కిరాణా సామాన్లు వదలిపెట్టి వెళ్లిపోయాడు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

కుబీర్, మే 14 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ కుబీర్ మండల కమిటీని ఎన్నుకున్నట్లు బీజేపీ మండల అధ్యక్షులు తెలిపారు. ఎమ్మెల్యే పవార్ రామరావుపటేల్ ఆదేశాల మేరకు మండల పూర్తిస్థాయి కమిటీని 45 మంది కమిటీ సభ్యులతో ఎన్నుకున్నామన్నారు. ప్రధానకార్యదర్శులుగా నారా వైద్యనాథ్, రోహిత్‌కుమార్‌లను నియమించగా ఉపాధ్యక్షులుగా నాగభూషణ్, ఊరడి గంగాధర్, రాథోడ్‌బాబు, కార్యదర్శులుగా ఎంపల్కార్ నందు, సూర్యవంశీ సుభాష్, జాదవ్ సునీతబాయి, సుంకరి రాణిలు నియమితులయ్యారు. 34 మంది సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

నిర్మల్ రూరల్ : బీజేపీ నిర్మల్ మండల కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ తెలిపారు. ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఆదేశానుసారం మండల అధ్యక్షులుగా వెంకట్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు జి.రాజేశ్వర్, రాజేందర్, తోకల రాజు, నర్సారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా నరేందర్, శ్రీనివాస్, కార్యదర్శులుగా లవ కుమా ర్ గౌడ్, శ్రీలత, భీమేష్, ముత్యం, ట్రెజరీగా బి.రమేష్‌తో పాటు 35 మంది కార్యవర్గంగా ఎన్నుకున్నామని తెలిపారు.

నేడు కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం

నిర్మల్ కల్చరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్టు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే. శ్రీహరి రావు తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో స్థానిక రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ఉంటుందన్నారు.


అవ్వ తెచ్చిన సద్దన్నం తింటున్న రైతన్న

ఆశల సాగుకు సన్నద్ధం

ఒడిదొడుకుల మధ్య గతేడాది పంటను పూర్తి చేసుకున్న అన్నదాతలు ఆశల సాగుకు సన్నద్ధమవుతున్నారు. రానున్న ఖరీఫ్ సాగు కోసం పొలాలను సిద్ధం చేస్తున్నారు. దుక్కులు దున్నడం, తుక్కు ఏరివేత, పశువుల ఎరువు చల్లడం, చదును చేయడం వంటి పనులు చేపడుతున్నారు. ఎండల కారణంగా కొన్ని రోజులు పొలం పనులకు విశ్రాంతి ఇచ్చిన రైతులు తాజాగా వర్షకాలం దగ్గర పడుతుండడంతో ఉదయమే చేనులోకి బయలుదేరుతున్నారు. మరోవైపు రైతులకు అవసరమైన పత్తి, సోయా, కంది విత్తనాలు సిద్ధంగా ఉంచామని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే నైరుతి రుతు పవనాలు అండమాన్‌ను తాకగా మరికొన్ని రోజుల్లో కేరళకు రానున్నాయి. ఈ నెలాఖరులో తెలంగాణలోను వర్షాలు ప్రారంభమవుతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

● (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)


ఫొటో న్యూస్

దుక్కులు దున్నుతున్న రైతన్న


చేనులోకి వెళ్తున్న రైతన్న


ఎరువు తీసుకెళ్తున్న రైతు


పొలంలో ఎరువు వేస్తున్న రైతు


పంటను చదును చేస్తున్న రైతులు



ఉపాధి హామీలో అక్రమాలకు చెక్

● గ్రామ స్థాయిలో నిఘా వ్యవస్థ ఏర్పాటు


ఆంధ్రజ్యోతి పరిశీలన


ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

దిలావర్‌పూర్, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ప్రభుత్వం కొరడా ఝులిపించనుంది. ఉపాధి హామీ పథకంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతుండటంతో ప్రభుత్వం అక్రమాలను అడ్డుకట్ట వేసేందుకు గ్రామస్థాయిలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీల పేరుతో నిఘా వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. ఈ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీల ఏర్పాటుతో ఉపాధిలో అక్రమాలు, నిధుల దుర్వినియోగం, గోస్ట్ వర్కర్లను అరికట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. డిజిటల్ ట్రాకింగ్, రియల్ టైం రిపోర్టింగ్ ద్వారా ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయడంతో పాటు ఉపాధి హామీ పథకాన్ని పారదర్శకంగా అమలు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే గ్రామ స్థాయిలో నిఘా వ్యవస్థను ప్రవేశపెట్టి పకడ్బందీ చర్యలకు ఉపక్రమించింది.

విజిలెన్స్ మానిటరింగ్ కమిటీల విధి విధానాలు

ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో కూడిన విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీలో స్వయం సహాయ సంఘాల మహిళలతో పాటు ఎస్సీ, ఎస్టీలు ఉండే విధంగా కార్యాచరణ రూపొందించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఈ కమిటీని ఎంపిక చేసి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థకు ప్రతిపాదిస్తారు. తద్వారా కలెక్టర్‌కు, అక్కడి నుంచి రాష్ట్ర అధికారులకు నివేదికలు పంపుతారు. రాష్ట్ర అధికారుల ఆమోదంతో ఈ కమిటీలు రంగంలోకి దిగనున్నాయి. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ వారానికి ఒకసారి పని చేసే ప్రదేశానికి వెళ్లి పరిశీలించాల్సి ఉంటుంది. ప్రతీ నెల మూడో శుక్రవారం ఉపాధి హామీ సిబ్బంది, కూలీలతో సమావేశం నిర్వహించి పనుల నాణ్యత, వ్యయం, సంబంధిత రికార్డులను తనిఖీ చేయాల్సి ఉంటుంది. సామాజిక తనిఖీ జరిగే సమయంలో ఇందులో సంబంధించిన నివేదికలను అధికారులకు సమర్పిస్తుంది. అందులో అక్రమాలు జరిగినట్లు తేలితే అధికారులు అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటారు. ఈ కమిటీలు ఆరు నెలల పాటు పని చేస్తాయి. దిలావర్‌పూర్ మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో మొత్తం 7,039 జాబ్ కార్డులు ఉండగా అందులో ఈ ఏడాది 2,542 జాబ్ కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. 3,406 మంది కూలీలు పని చేస్తున్నారు.

పారదర్శకంగా ఉపాధి పనులు

● అరుణ రాణి, ఎంపీడీవో, దిలావర్‌పూర్



గ్రామ స్థాయిలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీల ఏర్పాటుతో ఆయా గ్రామాల్లో జరిగే ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకత ఉంటుందన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన సర్క్యులర్లను గ్రామ కార్యదర్శులకు అందించాం. నియమ నిబంధనల మేరకు పంచాయతీ కార్యదర్శులు కమిటీ సభ్యులను ఎంపిక చేసి నివేదికలు అందజేశాక ఆ నివేదికలను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తాం. అవి ఆమోదం పొందాక కమిటీలు పూర్తిస్థాయిలో తమ విధులను ప్రారంభిస్తాయి.

కమిటీల ఏర్పాటు శుభ పరిణామం

● పి. దివ్య రెడ్డి, ఏపీవో, ఉపాధి హామీ పథకం



గ్రామ స్థాయిలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభ పరిణామం. పనుల్లో పారదర్శకతకు అవకాశముంటుంది. దీనివల్ల ఇటు అధికారులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అటు కూలీలకు ఎలాంటి అనుమానాలకు తావు ఉండదు. అంతా సజావుగా జరిగిపోతుంది. పారదర్శకంగా పనులు జరుగుతాయి.

ప్రయాణంలో తొందరతనం.. కారాదు ప్రమాదం!


జాతీయ రహదారిపై రోడ్డు డివైడర్ పైకెక్కి దిగుతున్న వాహనదారుడు

ఇచ్చోడ, మే 14 (ఆంధ్రజ్యోతి): గమ్యం చేరాలన్న తొందరలో ప్రమాదాలను కొనితెచ్చుకుం టున్నారు కొందరూ అలాంటిదే ఈ చిత్రం.. ఇచ్చోడ మండల కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ బంకు సమీపంలోని జాతీయ రహదారిపై కనిపించింది ఈ దృశ్యం. రోడ్డుకు అవతలి వైపు వెళ్లాలన్నా తొందరలో కొందరూ తమ ద్విచక్ర వాహనాన్ని ఇలా డివైడర్‌ను దాటిస్తున్నారు. ప్రమాదమని తెలిసినా ఇలా దాటిస్తుండడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. గమ్యం చేరడంలో తొందర పాటు ప్రాణాల మీదకు తెస్తుంది. అక్కడున్న స్థానికుల ప్రకారం.. సిరిచెల్మ అటవీ ప్రాంతం నుంచి ఇచ్చోడ మండల కేంద్రానికి అక్రమ మార్గం గుండా ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపానికి వచ్చేందుకు ఓ చిన్నపాటి రహదారి వెంట స్మగ్లర్లు కలప దందాను కొన సాగిస్తుంటారు. బైక్‌పై కలప దుంగలను సంచిలో నింపుకొని ఎవ్వరి కంట పడకుండా గమ్య స్థానానికి చేరుకునే తొందరలో ఇలా ఇష్టారాజ్యంగా రోడ్లను దాటి వేగంగా వెళుతుంటారు. కొందరూ ఇలా బైక్‌లపై కలప అక్రమ రవాణా చేస్తున్నారని వినికిడి. పగటి సమయంలో దర్జాగా కలప అక్రమ రవాణా చేస్తున్నా అటవీ అధికారులకు మాత్రం ఏం జరుగుతుందో తెలియకుండానే ఒక చోటు నుంచి మరోచోటుకు కలప అక్రమ రవాణా సాగుతుందా.. అని స్థానికులు గుసగుసలాడుతున్నారు.

'అతివేగం ప్రమాదకరం'

తానూర్, మే 14 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులలు అతివేగంగా ప్రయాణించడం ప్రమాదకరమని ట్రైనీ ఎస్సై నవనీత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరానికి దారితీస్తుందని, మద్యం సేవించి వాహనాలను నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. తప్పనిసరిగా వాహనాలకు ఇన్సురెన్సు చేసుకోవాలన్నారు. సరైన వాహనాల పత్రాలు లేనట్లయితే వాహనాలకు జరిమాన విధిస్తామన్నారు. కారునడిపేటప్పుడు సీటు బేల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు.

అ'పూర్వ'ం.. విద్యార్థుల సమ్మేళనం

పెంబి, మే 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004-2005 పదో తరగతి విద్యార్థులు బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పాఠాలు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణేష్, రమేష్, పుష్పాల మల్లేష్, ధర్మేందర్, విఠల్, పూర్వ విద్యార్థులు సతీష్, నర్సయ్య, రాజేందర్, రాజబాబు, సురేందర్, రాజు నాయకులు, రఘు, తదితరులు ఉన్నారు.


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మైనారిటీ విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం
దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ మైనారిటీ వసతి గృహ విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో మైనారిటీ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లను అధికారులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025-26 విద్యాసంవత్సరానికి గాను మైనారిటీ వసతి గృహాల్లో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. 6, 7, 8వ తరగతుల్లో పరిమిత సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మైనారిటీ వసతి గృహాల్లో అవసరమైన వసతులు, నాణ్యమైన బోధన, రుచికరమైన ఆహారం లభించనున్నాయని, విద్యాసంవత్సరానికి అవసరమయ్యే పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేస్తామని కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి మోహన్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే రాకపోకలు బంద్

● తలమడుగులో లో లెవల్ వంతెనలతో ఇబ్బందులు ● హామీలకే పరిమితమైన హై లెవల్ వంతెన నిర్మాణం


జర దేఖో!!

మండల కేంద్రానికి అనుకొని ఉన్న పెద్ద వాగు లోలెవల్ వంతెన ఉండటంతో ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగు (ఫైల్)


దొర్లి నుంచి పల్సికేకు వాగు దాటుకుంటూ వెళుతున్న రైతులు (ఫైల్)

తలమడుగు, మే 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలతో రోడ్ల నిర్మాణవ చేపడుతున్నప్పటికీ వంతెనల నిర్మాణం కోసం నిధులు కేటాయించకపోవడంతో లో లెవెల్ వంతెనలతో ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలో సుంకిడి నుంచి తలమడుగు మండల కేంద్రానికి. రావాలంటే మూడు లో లెవెల్ వంతెనలు ఉండ డంతో ప్రయాణికులకు వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏ చిన్న వర్షం కురిసిన లో లెవెల్ వంతల పైనుంచి పొంగిపొర్లడంతో రాక పోకలకు ఇబ్బంది తప్పడం లేదు. హై లెవెల్ వంతల నిర్మాణం కోసం అధికారులు నాయకులు హామీలు ఇస్తున్నారు తప్ప ఇప్పటి వరకు ఎలాంటి నిధులు కేటాయించలేదు. కేవలం ప్రతిపాదనలకే పరిమితమవుతున్నాయని విమర్శలు వ్యక్తం అవుతున్నా యి. గత వర్షాలు కురిసిన భారీ వర్షాలకు లో లెవెల్ వంతెనలు పొంగి పొర్లిపోవడంతో గంటల తరబడి వాగు వద్ద నిరీక్షణ చేయవలసిన పరిస్థితి ఏర్పడ్డాయి. ముఖ్యంగా మండల కేంద్రానికి ఆనుకొని ఉన్న పెద్దవాగు వద్ద ప్రతి సంవత్సరం ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాగా ఇటీవల జిల్లాలోని ఆయా గ్రామాలకు వంతల నిర్మాణం కోసం నిధులు మంజూరైన ప్పటికీ తలమడుగు మండలానికి ఒక వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు కాకపోవడం పట్ల మండల వాసులు అసంతృప్తిగా ఉన్నారు. అదేవిధంగా కొన్ని గ్రామాల వద్ద వంతెనలో నిర్మాణం చేపట్టకపోవడంతో అర చేతిలో ప్రాణాలు పెట్టుకొని రైతులు, కూలీలు వాగులు దాటుకుంటూ వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడ్డాయి. ఇకనైనా అధికారులు స్పందించి మండలంలో హై లెవెల్ వంతెనల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు

● నిర్మల్ జిల్లాకు 3500 క్వింటాళ్లు కేటాయింపు

● పీఏసీఎస్‌ల ద్వారా విక్రయాలు

భైంసా, మే 14 (ఆంధ్రజ్యోతి); రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి సబ్సిడీపై పచ్చిరొట్ట(జీలుగు) విత్తనాలను అందించేందుకు గాను చర్యలు చేపట్టింది. ప్రతీ సంవత్సరం వాన కాలపు పంటలకు ప్రభుత్వం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తోంది. రానున్న వాన కాలపు పంటల కోసం గాను ప్రభుత్వం నిర్మల్ జిల్లాకు 3,500 వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను కేటాయించారు. జిల్లాలోని ప్రాథమిక సహకార సంఘాల ద్వారా సంబంధిత విత్తనాలను విక్రయించేందుకు గాను జిల్లా వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేపట్టింది. సహకార సంఘాలు లేని ప్రాంతాల్లో అగ్రో రైతు సేవా, డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా పచ్చిరొట్ట విత్తనాల విక్రయాలు జరుగనున్నాయి. వానాకాలంలో వర్షాలు కురిసే కంటే ముందే వీటిని పంపిణీ చేయాలని వ్యవసాయ శాఖ యోచిస్తోంది. వారం రోజుల వ్యవధిలో పచ్చిరొట్ట విత్తనాలు జిల్లాకు సరఫరా కానున్నాయి. ప్రభుత్వం గతేడాది 60 శాతం ఉన్న సబ్సీడిని 50 శాతానికి తగ్గించింది.ప్రభుత్వం క్వింటా విత్తనాల ధర రూ. 14,250గా నిర్ణయించింది. 50 శాతం సబ్సీడిగా రూ. 7125 ప్రభుత్వం భరిస్తుంది. ఒక్కో క్వింటాకు రైతులు రూ. 7125 చెల్లించాల్సి ఉంటుంది. 30 కిలోల జీలుగ విత్తనాల బస్తాను రూ. 2137,50కి, 40 కిలోల జనుము విత్తనాల బస్తాను రూ. 2,510లకు రైతులకు అందించనున్నారు.


సరఫరా కోసం సిద్ధంగా ఉంచిన విత్తనాల బస్తాలు

● పెరిగిన డిమాండ్

ఎరువుల ధరలు పెరగడంతో చాలా మంది రైతులు పచ్చిరొట్ట విత్తనాలపై ఆసక్తి చూపుతున్నారు. పచ్చిరొట్ట విత్తనాలను రెండున్నర ఎకరాలకు 30 కిలోల చొప్పున చల్లుకుంటే రసాయన ఎరువులు వాడనవసరం లేదు. పంట దిగుబడి కూడా గణనీయంగా పెరుగుతుంది. ఈ విషయమై నిర్మల్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్‌ను ఆంధ్రజ్యోతి సంప్రదించగా.. విత్తనాల సరఫరా అవ్వగానే విక్రయాలు ప్రారంభింప చేస్తామని పేర్కొన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు అవసరమున్న రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డుల జిరాక్స్ ప్రతులు ఇచ్చి కొనుగోలు చేయాలని సూచించారు.



డిగ్రీ కళాశాలకు నూతన కోర్స్ మంజూరు

ఆదిలాబాద్ టౌన్, మే 14(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్‌కు బీఎస్సీ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ అనే నూతన కోర్స్ మంజూరు అయినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జె.సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య, వైద్య సేవల రంగంలో ఉపాధి అవకాశాలు విస్తృతమవుతున్న దృష్ట్యా 60 సీట్లతో ప్రభుత్వం ఈ కోర్సు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. బైపీసీ పూర్తి చేసిన విద్యార్థులు బీఎస్సీ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్‌లో చేరవచ్చని సూచించారు. దోస్త్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశం పొందవచ్చని, ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న పీవో ఖుష్బుగుప్తా

'రాజీవ్ యువ వికాసం'ను వేగిరం చేయాలి : ఐటీడీఏ పీవో

ఉట్నూర్, మే 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పథకం రాజీవ్ యువ వికాసం 2024- 25 అమలును వేగిరం చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా అన్నారు. బుధవారం మంచిర్యాల డీటీడీఓ, జన్నారం ఎంపీడీవో కార్యాలయాల అధికారులతో జన్నారం మండలంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిర్ణీత సమయానికి అన్నిరకాల పరిశీలనలను పూర్తి చేసి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజులోపు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని ఆదేశించారు. మంచిర్యాల జిల్లావ్యాప్తంగా గిరిజన ఆర్థిక సహకార సంస్థ దరఖాస్తుల పరిశీలనలను పర్యవేక్షించాలని మంచిర్యాల డీటీడీవోని ఆదేశించారు.



బజార్‌హత్నూర్‌లో పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ విశారదన్ మహరాజ్

ఆరోగ్య తెలంగాణే.. మా భూమి రథయాత్ర లక్ష్యం

● రాష్ట్ర కన్వీనర్ డా.విశారదన్ మహరాజ్

ఇచ్చోడ/ బజార్‌హత్నూర్, మే 14(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య తెలంగాణే లక్ష కిలోమీటర్ల 'మా భూమి రథయాత్ర' లక్ష్య మని అందుకనే ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రభుత్వ పాఠశాలలో, కాలేజీల వసతి గృహాల్లో నిర్వహణ తీరును బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డా.విశారదన్ మహరాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా బుధవారం బజార్‌హత్నూర్ మండల కేంద్రానికి చేరుకున్న లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్రను ఉద్దేశించి ప్రసంగించారు. అణగారిని వర్గాల సమస్యల పరిష్కారం కొసమే లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్ర చేపట్టామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. రథయాత్రలో ప్రజా సమస్యలను తెలుసు కుని ఆయా జిల్లాల కలెక్టర్లు, ముఖ్యమంత్రితో చర్చించి పరిష్కరింపజేసేందుకే ఈ కార్యక్రమంలో భాగంగా స్వయంగా ప్రజల బాధలు తెలుసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర నాయకులు అన్నెల లక్ష్మణ్ నాయకులు వెంకటేష్, సర్కిల్ నరేష్, గంగయ్య, గణేష్, లక్ష్మణ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులపై స్పందించాలి

బోథ్, మే 14(ఆంధ్రజ్యోతి): తాగునీటి ఇబ్బందులు తలెత్తినట్లయితే తక్షణమే స్పందించాలని బోథ్ ఎంపీడీవో రమేష్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నారాయణపూర్, అందూర్, బిర్లాగొంది గ్రామాలలో తాగునీటి సరఫరా పరిశీలించారు. అంతేగాక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా ప్రతీరోజు నీటిని సరఫరా చేస్తున్నారా? అని ప్రశ్నించారు. సరఫరా కాకుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కుచ్లాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.




ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో



▸ జిల్లాలో పథకం మంజూరు కోసం మొదలైన పైరవీలు
▸ టార్గెట్ 12,580.. వచ్చిన దరఖాస్తులు 47,806
▸ గ్రామ సభల ద్వారా అర్హులైన లబ్ధిదారుల ఎంపిక
▸ సిబిల్ స్కోర్ లింకుపై స్పష్టతనిచ్చిన ప్రభుత్వం
▸ జూన్ 2న లబ్ధిదారులకు మంజూరు పత్రాల అందజేత

'యువ వికాసం'.. కొందరికేనా?



ఆదిలాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కొందరికే అన్నట్లుగా కనిపిస్తుంది. ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తు మొదలు పెట్టింది. 2025 ఏప్రిల్ 6న విధివిధానాలను ఖరారు చేస్తూ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించింది. దీంతో ఎందరో మంది యువతి యువకులు రాజీవ్ యువ వికాసానికి భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. గడువు సమయం ముగిసేసరికి జిల్లాలో 47806 దరఖాస్తులు వచ్చినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తారు. ఎంపికైన వారికి ఆర్థిక సహాయం అందించే విధంగా రూ.50 వేల నుంచి రూ.4లక్షల వరకు రుణమొత్తాన్ని మంజూరు చేయనున్నారు. రుణాలపై 60 శాతం నుంచి 80 శాతం వరకు సబ్సిడీని అందిస్తూ ఈ పథకం ద్వారా యువతను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తుంది. ఈ నెల 30లోగా అర్హుల జాబితాను సిద్ధం చేసి జిల్లా ఇన్‌చార్జీ మంత్రికి నివేదిక అందించనున్నారు. మంత్రి ఆమోదం తర్వాత తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించేందు కు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు.

నేతల చుట్టు చక్కర్లు

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న వారంతా రాజకీయ నేతల చుట్టు చక్కర్లు కొడుతున్నారు. ఎలాగైనా తమకు పథకం మంజూరయ్యేలా చూడాలంటూ నేతల వద్ద మొరపెట్టుకుంటున్నారు. పథకానికి దరఖాస్తు చేసుకున్న ఆప్లికేషన్ హార్డ్‌కాపీలను నేతలకు అందజేస్తున్నారు. ఓ అడుగు ముందుకేసిన అధికార పార్టీ నేతలు తమ అనుచరుల జాబితాలను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. నియోజకవర్గ ఇన్‌చార్జీల ద్వారా జిల్లా ఇన్‌చార్జీ మంత్రికి అందించే విధంగా ప్రయత్నాలు మొదలు పెట్టారు. కొన్ని గ్రామాల్లోనైతే కొందరు దళారులు దరఖాస్తుదారుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటూ ముందే బేరం కుదుర్చుకుంటున్నట్లు తెలుస్తుంది. మొదట అడ్వాన్సు రూపంలో కొంత మొత్తాన్ని తీసుకుంటూ.. పథకం మంజూరైన తర్వాత పూర్తిగా చెల్లించాలని ఒప్పందం చేసుకుంటున్నట్లు సమాచారం. దరఖాస్తులు చేసుకున్న వారంతా అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల వద్దకు క్యూ కడుతున్నారు. దీంతో నేతల నివాసాలు, కార్యాలయాలు దరఖాస్తుదారులతో సందడి సందడిగా కనిపిస్తున్నాయి. ఖానాపూర్ నియోజక వర్గంలో కాంగ్రెస్ నేతలు చెప్పిన వారికే పథకం దక్కేలా కనిపిస్తున్నా ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో మాత్రం దీనికి భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

శాఖల వారీగా వచ్చిన దరఖాస్తులు.. విధించిన టార్గెట్

శాఖ	దరఖాస్తులు	టార్గెట్
1. గిరిజన సంక్షేమ శాఖ	13,121	6,481
2. ఎస్సీ కార్పొరేషన్	9,804	2,662
3. బీసీ కార్పొరేషన్	18,984	2,403
4. మైనార్టీ వెల్ఫేర్	5,842	1,003
5. క్రిస్టియన్‌వెల్ఫేర్	55	31
మొత్తం	47,806	12,580

జిల్లా టార్గెట్ 12,580

రాజీవ్ యువ వికాసం పథకానికి జిల్లాలో 47 వేల 806 దరఖాస్తులు రాగా.. ప్రభుత్వం మాత్రం జిల్లాకు 12,580 టార్గెట్‌ను విధించింది. దీంతో సుమారుగా 35,226 మంది రాజీవ్ యువ వికాసం పథకానికి దూరంకానున్నారు. దీంతో కొందరికే పథకం వర్తించే అవకాశం ఉందంటున్నారు. ఈ పథకంపై భారీ ఆశలు పెట్టుకున్న ప్రభుత్వం టార్గెట్ విధించడంతో ఎందరో మందికినిరాశ తప్పదంటున్నారు. గతంలో దళితబంధు, బీసీబంధు, ఇతర పథకాలను పొందిన వారు ఈ పథకానికి అర్హులు కాదని అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో సబ్సిడీ పథకాలను తీసుకున్న వారిని అర్హుల జాబితా నుంచి తొలగించనున్నారు. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా మొత్తం 4 క్యాటగిరిలుగా విభజించారు. మొదటి క్యాటగిరిలో రూ.50 వేలు, రెండవ క్యాటిగిరిలో రూ.లక్ష, మూడవ క్యాటగిరిలో రూ.2 లక్షలు, నాల్గవ క్యాటగిరిలో రూ.4 లక్షల వరకు దరఖాస్తు చేసుకున్న వారిని పరిగణిస్తారు.

ఆమోదం తప్పనిసరి

ఇప్పటికే అధికారులు కార్పొరేషన్ల వారీగా వచ్చిన దరఖాస్తులను వెరిఫికేషన్ పూర్తి చేశారు. దరఖాస్తుదారులకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను కూడా సేకరించారు.ఈ నెల 19 వరకు గ్రామ, మండల స్థాయి సమావేశాలను పూర్తి చేయనున్నారు. అనంతరం కార్పొరేషన్ల వారీగా అర్హుల జాబితాలను సిద్ధం చేస్తారు. 26 వరకు జిల్లా స్థాయిలో వెరిఫికేషన్ పూర్తి చేయనున్నారు. ఈ నెల 30 వరకు అర్హులైన లబ్ధిదారుల జాబితాను ఫైనల్ చేసి జిల్లా కలెక్టర్ ద్వారా జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కకు అందజేస్తారు. అయితే గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఏర్పాటు చేసిన కమిటీల ఆమోదం తప్పనిసరి కానుంది. అయితే అధికార పార్టీ నేతలు సిద్ధం చేసిన జాబితాలకే కొంత ప్రాధాన్యతను ఇచ్చే అవకాశం కనిపిస్తుంది. అర్హుల జాబితాను ఫైనల్ చేస్తే గందరగోళ పరిస్థితులకు దారి తీసే



(తరువాయి 6వ పేజీలో...)

శిక్షణ తరగతుల ద్వారా నైపుణ్యత, అభ్యాసన సామర్థ్యం పెంపొందించుకోవాలి

● జిల్లా కలెక్టర్ రాజర్షి షా ● డైట్ కళాశాలలో జిల్లా స్థాయి వృత్తాంతర శిక్షణ తరగతులు ● హాజరైన డీఈవో, ఉపాధ్యాయులు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా



డైట్ కళాశాలలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తూ..

ఆదిలాబాద్ టౌన్, మే 14(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు శిక్షణ తరగతుల ద్వారా నైపుణ్యత, అభ్యాసన సామర్థ్యం పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం పట్టణంలోని డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాలు, బోధన నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానం, జీవన నైపుణ్యాల పెంపు కోసం ఐదు రోజుల జిల్లా స్థాయి వృత్తాంతర శిక్షణ తరగతులను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఉపాధ్యాయులు వివిధ అంశాలపై శిక్షణలో నేర్చుకుంటున్న అంశాలపై నేరుగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం బొక్కలగుడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల-2ను సందర్శించి రిసోర్స్ పర్సన్, ఉపాధ్యాయులు మొబైల్ షాప్‌లో సెల్ ఫోన్‌లు ఎలా కొనాలి అన్న దానిపై స్క్రిప్ట్ ద్వారా ప్రదర్శించిన తీరును కలెక్టర్ తిలకించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి శ్రీనివాస్, ఏఎంఓ శ్రీకాంత్, సుజిత్ ఖాన్, అజయ్, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

● 'అడవి నుంచి ఏఐ వైపునకు అడుగులు' పుస్తక ఆవిష్కరణ

ఆదిలాబాద్ టౌన్: ఆదిలాబాద్ డైట్ కళాశాల ఉపాధ్యాయ శిక్షణ కేంద్రంలో బుధవారం కలెక్టర్ రాజర్షి షా చేతుల మీదుగా తొడసం కైలాష్ ఇంగ్లీష్‌లో ఫ్రం ఫారెస్ట్ ల్యాండ్ టూ ఏఐ వరల్డ్ అనే పుస్తకం దీన్నే తెలుగులో అడవి నుంచి ఏఐ వైపునకు అడుగులు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో తొడసం కైలాష్ తన చిన్ననాటి నుంచి తన అమ్మతో తునికి ఆకులు తెంపడానికి అడవికి వెళ్లిన జ్ఞాపకాలు, తన తండ్రితో అన్నయ్య తమ్ముడితో కలిసి అడవికి పొయ్యిల కట్టెలు, వడ్రంగి పనికి వచ్చే కట్టెలను తేవడానికి అడవికి వెళ్లిన జ్ఞాపకాలు, తన చెల్లెలితో ఇప్ప పువ్వు, ఇప్ప పరక సేకరించడానికి అడవికి వెళ్లిన జ్ఞాపకాలు, తమ పశువులను కాపరిగా ఉన్నప్పుడు ఎదుర్కొన్న కష్టాలను, తన జీవితంలో ఏ విధంగా కష్టపడి ఉపాధ్యాయ వృత్తిలో చేరి అనుభవించిన కష్టాలను, అనుభవాలను, విద్యార్థులకు సాంకేతిక విద్యను అందిస్తూనే, కంప్యూటర్, ఏఐ టెక్నాలజీ నేర్చుకొని తన మాతృ భాష పరిరక్షణ కోసం పుస్తకాలు రాస్తూ పాటలు పాడించడం, వార్తలు చదివించి దేశ ప్రధాని మెచ్చుకునే స్థాయికి ఎదిగిన విధానాన్ని ఈ పుస్తకంలో ప్రస్తావించారు. ఈ పుస్తకాన్ని కూడా తొడసం కైలాష్ ఏఐ టెక్నాలజీ ఉపయోగించి కవర్ పేజీ డిజైన్‌తోపాటు మైండ్ మ్యాపింగ్ తయారు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కైలాష్ తన మాతృ భాషకు చేస్తున్న కృషిని దేశ ప్రధాని మెచ్చే స్థాయికి ఎదగడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కోల కిరణ్ కుమార్, ఏఎస్‌సీ సుజాత్ ఖాన్, ఏఎంఓ శ్రీకాంత్ గౌడ్, ఎస్ఆర్‌పీ రఘునాథ్, ఉపాధ్యాయులు అజయ్ కుమార్ పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్, మే14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగన్నపేట గ్రామం సమీపంలోని రైస్‌మిల్ వద్ద మహిళ సమాఖ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. రైతులు తమ పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ రాథోడ్‌రవీందర్, జైనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్‌రావు, ఆదిలాబాద్ జిల్లా ఆర్టీఐ మెంబర్‌దూట రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇక్బాల్, మండల అధ్యక్షులు అబ్దుల్ ఖయ్యూం, ఐకేపీ ఏపీఎం అనిల్, ఏఈఓ కుడిమెత సుధాకర్, డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రేమ్‌నివాస్, ఓమేశ్వర్, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'అర్హులందరినీ లబ్ధిదారులుగా గుర్తిస్తాం'

నేరడిగొండ, మే 14 (ఆంధ్రజ్యోతి): అర్హులందరినీ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా గుర్తిస్తామని నేరడిగొండ ఎంపీడీవో రాజ్‌వీర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గుత్పల గ్రామానికి చెందిన బాపూరావు (ఇంద్రవెల్లి అమరుడు) కుటుంబానికి మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి శివ, గ్రామస్థులు, తదితరులు ఉన్నారు.

మూఢ నమ్మకాలు, నాటు వైద్యానికి దూరంగా ఉండండి

● ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ ● పోలీసుల ఆధ్వర్యంలో బోథ్ మండలం పాట్నాపూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ● తరలివచ్చిన 300 మందికి పైగా ఆదివాసీ, గిరిజనులు

బోథ్, మే 14(ఆంధ్రజ్యోతి): మారుమూల గిరిజన గ్రామాలలో నివసించే ఆదివాసీ ప్రజలు మూఢనమ్మకాలపు దూరంగా ఉండి నాటు వైద్యాన్ని నమ్మవద్దని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పాట్నాపూర్ గ్రామంలో పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నాగరిక ప్రపంచానికి దూరంగా ఉండకుండా జీవించాలన్నారు. ముఖ్యంగా నాటు వైద్యం భూత వైద్యం మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని, వ్యాధులు సోకిన వెంటనే వైద్యులను సంప్రదించి వారి సలహా మేరకు మందులు వాడాలన్నారు.

● ఆదివాసీ సంప్రదాయంతో ఘన స్వాగతం

గ్రామంలో వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఆదిలాబాద్ ఎస్పీని పాట్నాపూర్ గ్రామస్థులు ఆదివాసీ సంప్రదాయాలతో స్వాగతించారు. డోలు, సన్నాయి వాయిస్తూ ఎస్పీని గ్రామంలోకి తీసుకు వెళ్లడం జరిగింది. అనంతరం వైద్య శిబిరంలో వైద్య పరీక్షల తీరును పరిశీలించారు. ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు అయిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొని ప్రసంగించారు. జిల్లాలోని మారుమూల గ్రామాలలో పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం జరుగుతుందన్నారు.



వైద్య సేవల గురించి అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ



వైద్య శిబిరానికి హాజరైన ఆదివాసీ, గిరిజనులు

● తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా ఎదగండి

యువత చెడు మార్గంలో నడవకుండా తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఎదగాలన్నారు. మత్తుకు బానిసగా వద్దని, గంజాయి, సారా, గుట్కా, తంబాకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు చిన్నపిల్లలకు వాహనాలను ఇవ్వవద్దని, ఒకవేళ వాహనాలు ఇస్తే ఇటు తల్లిదండ్రులపైన, అటు చిన్నారుల పైన కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. యువత కోసం త్వరలోనే జాబ్ మేళా నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమస్యలు ఉంటే డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను అనుసరించి వాహనాలు నడపాలన్నారు. కాగా వైద్య శిబిరంలో 300 మందికి పైగా ఆదివాసీ, గిరిజనులు పాల్గొన్నారు.

● శిబిరానికి తరలివచ్చిన ఆదివాసీలు

వైద్య శిబిరానికి పాట్నాపూర్ గ్రామస్థులే కాకుండా ఇతర గ్రామాల నుంచి ఆదివాసీలు తరలి వచ్చారు. వైద్య శిబిరానికి దాదాపు 300లకు పైగా ఆదివాసీలు వైద్యం కోసం తరలిరావడంతో శిబిరం విజయవంతమైంది. శిబిరం నిర్వహణకు గత మూడు రోజుల నుంచి కృషి చేసిన స్థానిక సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై ప్రవీణ్‌లు హర్షం వ్యక్తపరిచారు. వైద్య శిబిరంలో వైద్య శిబిరం నిర్మల్ స్వప్న సూపర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సహకారంతో నిర్వహించగా జనరల్ మెడిసిన్ యూరాలజీ, గైనకాలజీ, న్యూరాలజీ, పీడియాట్రిషన్ ఆర్థోపెడిక్‌లో అనుభవజ్ఞులైన వైద్యులచే వైద్య సేవలు కొనసాగాయి. కార్యక్రమంలో స్థానిక సిఐ, ఎస్ఐలతో పాటు అదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, అడిషనల్ డీఎంహెచ్ఓ రవీంద్ర ప్రసాద్, ఏజి పి. శంకర్, డాక్టర్ శశికాంత్, స్వప్న, మల్లేష్, సచిన్ బాబు, ధ్రువన్ కుమార్, రాహుల్, దినేష్, బోథ్ ఆసుపత్రి వైద్య సిబ్బంది పోలీసు పాల్గొన్నారు.



● జిల్లా ఎస్పీని గిరిజన సంప్రదాయాల ప్రకారం స్వాగతిస్తున్న పాట్నాపూర్ ఆదివాసీలు